'విశ్వకర్మ' కమిటీసభ్యుడిగా వినోద్‌యాదవ్



కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్‌ను విశ్వకర్మ యోజన స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ జనరల్ మేనేజర్ ప్రీతి పవన్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చెప్పల్‌బజార్‌లోని బీజేపీ ఓబీసీ మోర్చా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి ఉత్సవాలు



నివాళులు అర్పిస్తున్న భరత్ భూషణ్, పల్లెల వీరస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన గొప్పనేత బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరామ్ అని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి అప్పికట్ల భరత్‌భూషణ్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ ఆధ్వర్యంలో కాన్షీరామ్ 91వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భరత్‌భూషణ్ మాట్లాడుతూ బడుగులకు రాజకీయ అధికారాన్ని రుచిచూపిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, రిటైర్డ్ సౌత్ సెంట్రల్ అధికారి దార్ల పోతరాజు, ఎర్ర దేవదానం, జి.హంసరాజు, ఎస్.నర్సింగ్‌రావు, ఎం.నర్సింగ్‌రావు, డాక్టర్ నతానియల్, కనకయ్య పాల్గొన్నారు.

సురభి పార్క్ అభివృద్ధికి మోక్షం



సురభిపార్క్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: ఎన్నో అడ్డంకుల అనంతరం సురభి పార్క్ అభివృద్ధికి మోక్షం లభించిందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. ఆమె జీహెచ్‌ఎంసీ హార్టికల్చరల్ విభాగం మేనేజర్ భాస్కర్ గౌతమ్‌లతో కలసి సురభిపార్కును సందర్శించి అభివృద్ధి పనుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు మూడు సంవత్సరాలకుపైగా సురభి పార్క్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈ పార్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి వహించి పట్టుదలతో అధికారులపై వత్తిడి తెచ్చి జీహెచ్‌ఎంసీ జనరల్ ఫండ్స్ నుంచి రూ.5 లక్షలతో బోర్‌వెల్ ఏర్పాటు చేసి మరో రూ.2 లక్షలతో పార్కు సుందరీకరణ పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేవైఎం నేతలు అరుణ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో విడుదల అభినందనీయం

కాచిగూడ: కులగణన సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జీవో విడుదల చేయడం శుభ సూచకమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. జాతీయ బీసీదళ్ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడలో కుల సర్వేకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ అఖిలపక్ష, కుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సదస్సులో పలు తీర్మానాలు చేస్తూ ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. జాతీయ బీసీ దళ్ చేసిన విజ్ఞప్తిపై ప్రభుత్వం వెంటనే స్పందించి కులగణనకు సంబంధించి జీవోను విడుదల చేయడం హర్షణీయమన్నారు. ఈ మేరకు శుక్రవారం దుండ్ర కుమారస్వామి, బీసీ దళ్ ప్రతినిధులు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

నాలా సమస్యలు పరిష్కరించాలి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట్: డివిజన్‌లో నాలా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి ఎస్‌ఈ అనిల్ రాజ్‌ను కోరారు. శుక్రవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జున నగర్‌లో ఉన్న ఓయూ చెరువు నాలాను పరిశీలించారు. జనావాసాల గుండా వెళుతున్న నాలాలో పూడికతీత పనులతోపాటు, విస్తరణ అంశాన్ని పరిశీలించాలని ఆమె ఎస్‌ఈని కోరారు. కార్యక్రమంలో ఈఈ పేరాజు, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్ క్షమాపణ చెప్పాలి: డీఎస్పీ

కాచిగూడ: ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్‌పై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యక్తిగత విమర్శలను వెంటనే వెనక్కి తీసుకొని 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి బరిగెల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బర్కత్‌పురలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బహుజనుల ఆత్మగౌరవాన్ని అగ్రకుల దొర కేసీఆర్ పాదాల దగ్గర తాకట్టు పెట్టిన ఆర్ఎస్పీ రాజకీయ సన్యాసం తీసుకోవాలని సూచించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో మార్చి 15 నుంచి ఏప్రిల్ 30 వరకు పీడిత ప్రజల విముక్తి ప్రదాతల జన్మదిన ఉత్సవాలు, పార్టీ మొదటి ప్లీనరీ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రాసాల వినోద్ కుమార్ యాదవ్, తోట రాఘవేంద్ర ముదిరాజ్, గోల్కొండ వంశీకృష్ణ, మల్లెపాకుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలి



నిరాహార దీక్షలో న్యాయవాదులు

కవాడిగూడ: రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి (టీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎ. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి హైమత్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ న్యాయవాదుల సురక్ష సమితి ఆధ్వర్యంలో నిరాహార దీక్షను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన జూనియర్ న్యాయవాదులకు రూ.5 వేల ఉపకార వేతనం ఇవ్వాలని, న్యాయవాదుల సంక్షేమానికి ప్రతి సంవత్సరం రూ.100 కోట్లు మంజూరు చేయాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమితి సంయుక్త కార్యదర్శి రాజేష్ కులకర్ణి, కోశాధికారి దేవేందర్, కె.మీనాక్షి, కె.అర్చన, కుమార్, కార్తిక్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైనది..!



ల్యాంప్ లైటింగ్ సెర్మనీలో పాల్గొన్న డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఉషారెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న నర్సింగ్ విద్యార్థులు

ల్యాంప్ లైటింగ్ సెర్మనీలో ఉషారెడ్డి

నల్లకుంట: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆ వృత్తిని ఎంచుకొనేవారు రోగులకు సేవలందించడంలో నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ(డీడీఎంఎస్) అధ్యక్షురాలు ఎన్.ఉషారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లకుంటలోని డీడీహెచ్ఆర్‌సీ ఆడిటోరియంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ నర్సింగ్(డీడీసీవోఎన్) బీఎస్సీ నర్సింగ్ 20వ బ్యాచ్, జీఎన్ఎం 33వ బ్యాచ్ విద్యార్థుల 'ల్యాంప్ లైటింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి ఉషారెడ్డి జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో డీడీఎంఎస్ ఉపాధ్యక్షురాలు జీఎల్‌కే దుర్గ, గాంధీ నర్సింగ్ స్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ అస్క సలోమి, డీడీసీవోఎన్ యూనిట్‌ల కార్యదర్శి డాక్టర్ రమాదేవి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్, డీడీసీవోఎన్ ప్రిన్సిపాల్ శ్రావ్య స్పందన, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్, ఇతర యూనిట్ల సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

కవిత అరెస్టుపై బీఆర్ఎస్ ఆగ్రహం

సంఘీభావం తెలిపిన నేతలు



ముఠా జైసింహ



కొండపల్లి మాధవ్



శంకర్‌లూక్

ముషీరాబాద్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి ఒక రోజు ముందు అరెస్టు చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని ఆరోపిస్తున్నారు. అరెస్టు విషయం తెలిసిన వెంటనే ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ తోపాటు పలువురు బీఆర్ఎస్ నేతలు జూబ్లీహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ నేతలు కొండపల్లి మాధవ్, మైనార్టీ కమీషన్ మాజీ సభ్యులు శంకర్‌లూక్ తదితరులు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అరెస్టు చేసి ఢిల్లీ తీసుకుపోవడానికి ట్రాన్సిట్ వారెంట్ ఉండాలని, కాలనీ అలాంటి వారెంటు లేకుండానే కవితను అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకువెళ్లడం అక్రమమని అన్నారు. అన్ని శాఖల మాదిరిగానే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా బీజేపీకి అనుబంధ శాఖలాగా పనిచేస్తోందని విమర్శించారు. మహిళ అని కూడా చూడకుండా కవితను అరెస్టు చేయడం అనాయ్యమని విచారం వ్యక్తం చేశారు.

టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: టీ-సేవ ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీ-సేవా సెంటర్ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. టీ-సేవా కేంద్రం ద్వారా పాన్‌కార్డు, ట్రావెల్ సేవలు, మైక్రో ఏటీఎం, బ్యాంకింగ్ సేవాలు, ఆధార్ పేమెంట్ సేవలు, బిల్ పేమెంట్, ఇన్సూరెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఆన్‌లైన్ అడ్మిషన్ సేవలు అందించడం ద్వారా స్వయం ఉపాధిని పొందే వీలుంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతోపాటు కేంద్రప్రభుత్వ ఆమోదిత కంప్యూటర్ ఆపరేటర్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 8179955744, వెబ్‌సైట్: www.tsevacentre.com.

అంబర్‌పేట శంకర్‌కు శుభాకాంక్షలు



కాచిగూడ: ప్రముఖ సామాజిక సేవకుడు అంబర్‌పేట శంకర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను కలిసి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎర్రం శ్రీనివాస్ రావు, సంపత్ ముదిరాజ్, నరేష్, శేఖర్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కాంట్రాక్టర్లకు సూచించారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఆ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. నల్లకుంట డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ బస్తీలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీలో పాదయాత్ర చేసి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జలమండలి డీఈ ప్రవీణ్ కుమార్, శివం సెక్షన్ మేనేజర్ రోహిత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

'రీటా నేర్పిన పాఠం' పుస్తక ఆవిష్కరణ



ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో రీట నేర్పిన పాఠం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కమ్యూనిస్టు యోధురాలు బృందా కారత్ జీవిత చరిత్రకు సంబంధించిన విషయాలతో కూడిన 'రీటా నేర్పిన పాఠం' పుస్తకాన్ని శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందరరామన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బృందా కారత్ తన యవ్వన ప్రాయంలోనే దేశంలోని వివిధ సమస్యలపై స్పందించి వాటి పరిష్కారం కోసం పోరాటం చేశారని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి, కె.ఎన్.ఆశాలత, శశికళ, రత్నమాల, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు అండగా ఉండాలి



రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: తలసేమియా వ్యాధి బాధితులకు యువత అండగా ఉండాలని సన్ సీడ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ అన్వేష్ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ యువజన ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ యువత శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించి ఇతరుల ప్రాణాలు కాపాడటానికి దోహదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వరుణ్‌రాజ్, మహేందర్, ఆర్.వెంకటేశ్, మాధవి, లెనిన్, అశోక్‌రెడ్డి, ఎండీ జావేద్ తదితరులు పాల్గొన్నారు.

'చాత్తాద' కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అశ్వాపురం వేణుమాధవ్

నల్లకుంట: అన్ని రంగాలలో వెనుకబడిన చాత్తాద శ్రీ వైష్ణవుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లకుంటలోని నర్మదా భవన్‌లో గల చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం పాలకమండలి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణుమాధవ్ మాట్లాడుతూ విద్యావంతులైన తమ సామాజిక వర్గానికి చెందిన చాలామంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అల్లాడి పోతున్నారని, వారికి కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని అన్నారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తులసి సత్యనారాయణ, బిక్కుమళ్ల నిర్మల, ఆర్థిక కార్యదర్శి తిరుక్కవళ్లూరు కృష్ణస్వామి, సంయుక్త కార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా నేత పత్తి అనిల్ మృతి



అంబర్‌పేట్: బీజేపీ సీనియర్ నాయకుడు, ఓబీసీ మోర్చా సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు పత్తి అనిల్ అనారోగ్యంతో మృతి చెందారు. అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో నివసించే అనిల్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పార్టీ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యాయి.

సినారె పాటలు నిత్యనూతనం

చిక్కడపల్లి: సినారె పాటలు నిత్య నూతనమని తిరుమల బ్యాంక్ చైర్మన్ నుంగునూరు చంద్రశేఖర్ అన్నారు. వంశీ కల్చరల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో సి.నారాయణరెడ్డి తొలి సినీగీతం రచించి 65 సంవత్సరాలైన సందర్భంగా శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా పాటకు పట్టాభిషేకం శీర్షికతో నిర్వహించిన సినీగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా గాయనీగాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టి.సుధా, ఎస్.శైలజ, గంగ, యమునా, కావేరి, కృష్ణవేణి, శారద, రామకృష్ణ, శశికళ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

రూ.26 వేల కోట్లతో రీజినల్ రింగ్‌రోడ్డు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఓపెన్ జీమ్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: కేంద్రప్రభుత్వం సహకారంతో హైదరాబాద్ నగరాభివృద్ధి సుమారు రూ.26 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించినట్లు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య వ్యవహారాల శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ డివిజన్‌లోని వివేక్‌నగర్ పీపుల్స్‌పార్కులో రూ.11 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను స్థానిక కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌తో కలసి ప్రారంభించి ప్రసంగించారు. ఈ నిర్మాణం వల్ల నగరానికి ఒక మణిహారంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించే అవకాశం ఉటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న జనాభాలో 33 శాతం మంది హైదరాబాద్ లోనే ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో సమానంగా ముందుకు సాగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పూస రాజు, బీజేపీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాసాయిచంద్, ఆకులసురేందర్, బీజేపీ నేతలు ఉమేశ్, అరుణ్‌కుమార్, కాలనీ అధ్యక్షులు గంగరాజు, కార్యదర్శి నారాయణ, సంయుక్త కార్యదర్శ ఇ టి.ప్రేమ్‌కుమార్, ఎం.శివకుమార్, గణేష్, ఆంజనేయులు, జితేందర్, ఎస్.శ్రీనివాస్‌రావు, మోహన్‌రావు, ప్రవీణ్, నారాయణ వెంకట్, రజనీకాంత్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'నేతకాని' కార్పొరేషన్ కేటాయించాలని ధర్నా



బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న నేతకాని సంఘం నేతలు

కవాడిగూడ: రాష్ట్రంలో 20 లక్షలకు పైబడి జనాభా కలిగి ఉన్న నేతకాని కులానికి ప్రత్యేక కార్పొరేషన్ కేటాయించాలని తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధర్నా నిర్వహించారు. అనంతరం చలో సెక్రటేరియట్‌కు పిలుపునిచ్చి ముట్టడి కోసం ఆందోళనకారులు బయలుదేరగా పోలీసులు పలువురిని అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్ల రాజమల్లు, ఉపాధ్యక్షులు కె.నర్సయ్య, కె.ప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి జి.రాజం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్, రాష్ట్ర నాయకుడు శేషగిరి, దుర్గం సమ్మయ్య, జె.లక్ష్మణ్, జాడి ఈశ్వర్, పాపయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ, కుల పాలనపై ఉద్యమించాలి

కాన్షీరాం జయంతి సభలో జాజుల శ్రీనివాస్‌గౌడ్



కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో కుటుంబ, కుల పాలనకు వ్యతిరేకంగా బహుజన సమాజం కలిసికట్టుగా పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో బహుజన మహానేత కాన్షీరామ్ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజన రాజకీయ సిద్ధాంతాన్ని సమాజానికి అందించిన గొప్ప మహామేధావి కాన్షీరామ్ అని కొనియాడారు. క్షటటు అనే ఆయుధంతో బహుజనులు కూడా రాజకీయ అధికారం చేపట్టవచ్చని కాన్షీరామ్ నిరూపించారని అన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మణిమంజరి, ఉపాధ్యక్షురాలు స్వర్ణగౌడ్, కార్యదర్శి సమతా యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల మధు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, బీసీ సంఘాల నేతలు ఇంద్రం రజక, మహేశ్‌మేరు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓవర్‌సీస్' బకాయిలు విడుదల చేయాలి

ధర్నాచౌక్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు

కవాడిగూడ: విదేశీ విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. తల్లిదండ్రులు బద్రి రాథోడ్, భాస్కర్ పాత్‌లావత్, రాంబాబు, సమన్, శంకర్‌లు మాట్లాడుతూ విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లు పొందడానికి నిర్దేశించిన నిబంధనలను సులభతరం చేస్తూ ప్రత్యేక జీవో తీసుకురావాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్‌లను రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచాలన్నారు.

బీఎల్ఎఫ్ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా విడుదల




బీఎల్ఎఫ్ పార్లమెంటు అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మతోన్మాద బీజేపీ శక్తులను ఓడించడమే అంతిమ లక్ష్యంగా పనిచేయాలని బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీఎల్ఎఫ్ పోటీ చేయనున్న ఐదు స్థానాల అభ్యర్థుల తొలి జాబితాను గురువారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో విడుదల చేశారు. భువనగిరి పార్లమెంటరీ స్థానానికి నూనె వెంకటస్వామి, నలగొండకు మస్కుల మట్టయ్య, చేవెళ్లకు వనం సుధాకర్, నిజామాబాద్‌కు అబ్బగాని అశోక్‌గౌడ్, జహీరాబాద్‌కు వల్ల సాయికృష్ణ పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ దేశప్రజలు ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైనవి మతోన్మాదం, ఫాసిజం అని అన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ జాతీయ ప్రధానకార్యదర్శి మద్దికాయల అశోక్, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ కన్వీనర్ దండి వెంకట్, వనం సుధాకర్, కె.పర్వతాలు, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

మోదీ రోడ్‌షోకు తరలిన బీజేపీ శ్రేణులు



కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో మోదీ రోడ్‌షోకు తరలిన కాచిగూడ బీజేపీ నేతలు



తరలివెళుతున్న డీడీ కాలనీ బీజేపీ నేతలు

కాచిగూడ: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ రోడ్ షోకు కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్ యాదవ్, ఎస్.రవియాదవ్, బి.భీమ్‌రాజ్, మల్లికార్జున్, రమాదేవి, బల్బీర్, అరవింద్ పాల్గొన్నారు.

అంబర్‌పేట్: రోడ్‌షో కార్యక్రమానికి అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం డీడీ కాలనీ నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తరలివెళుతున్న నేతల ర్యాలీని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. కెంచె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.